

వైసీపీకి మూడో షాక్

- కాంగ్రెస్‌లో చేరిన పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- ఇప్పటికే పార్టీని వదిలేసిన చిత్తూరు, సత్యవేడు ఎమ్మెల్యేలు



వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కాంగ్రెస్‌లో చేరారు. కడప జిల్లా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో శనివారం ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. 2019 ఎన్నికల్లో తొలిసారి పూతలపట్టు నుంచి పోటీ చేసి గెలిచిన ఎంఎస్ బాబు నియోజకవర్గంలో స్వతంత్రంగా ఎన్నడూ పనిచేయలేక పోయారు. అగ్రనేతలకు వినయంగానే మసలుకున్నా.. 2024 ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని వైసీపీ అధిష్ఠానం ఆయనకు తేల్చిచెప్పింది. ఈ ఆవేదనను జనవరిలో మీడియా ముందు వెల్లడించారు. సీఎం జగన్.. దళితులకు అన్యాయం చేస్తున్నారని, ఓసీ సీట్లను మార్చకుండా రాష్ట్రవ్యాప్తంగా దళితుల సీట్లను మాత్రమే మారుస్తున్నారని ఆగ్రహించారు. అయితే రెండ్రోజులకే.. తూచ్ నేనలా అనలేదు, వచ్చే ఎన్నికల్లో వైసీపీ కోసమే పనిచేస్తానంటూ ప్రకటించారు. ఆ తర్వాత పూతలపట్టు అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు వైసీపీ అవకాశం ఇచ్చింది. 2019 ఎన్నికల సమయంలోనూ సునీల్‌కుమార్‌కు టికెట్ ఇవ్వకుండా ఇలాగే వ్యవహరించారు. ఎమ్మెల్యేగా ఎంఎస్ బాబు ఉన్నా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో సునీల్‌కుమార్ పాల్గొంటూ వచ్చారు. అయినా ఆయన ఓపికగా పార్టీలో కొనసాగారు. ఇటీవల పూతలపట్టులో జరిగిన జిల్లా స్థాయి సిద్ధం బహిరంగ సభ కార్యక్రమానికీ ఎంఎస్ బాబు హాజరుకాలేదు. ఆహ్వానించకుండా పార్టీ అవమానించిందని బాబు సన్నిహితులు చెప్పన్నారు. ఇలాంటి వరుస అవమానాలతో ఎంఎస్ బాబు కాంగ్రెస్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ నుంచి పోటీ?

తనను అవమానించిన వైసీపీని పూతలపట్టులో ఓడించేందుకు ఎంఎస్ బాబు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి వైసీపీ ఓట్లను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. పూతలపట్టు నియోజకవర్గంలో ఎంఎస్ బాబు ఈ ఐదేళ్ల తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తన కోసం ఆ వర్గం గట్టిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో సునీల్‌కుమార్‌ను ఓడించి తన లక్ష్యాన్ని సాధించుకునేలా బాబు ప్లాన్ చేసినట్లు సమాచారం.

వైసీపీని వదిలేసిన మూడో ఎమ్మెల్యే

ఎంఎస్ బాబు వైసీపీకి గుడ్‌బై చెప్పడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటి దాకా ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీని వీడినట్లు అయ్యింది. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పార్టీ వీడి తిరుపతి నుంచి జనసేన తరఫున పోటీ చేస్తున్నారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంను తిరుపతి ఎంపీగా పోటీ చేయమనడంతో ఆయనా టీడీపీలో చేరి సత్యవేడు నుంచే పోటీలో దిగుతున్నారు. తిరుపతి జిల్లా గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు కూడా టికెట్ దక్కక పార్టీని వీడారు.. ప్రస్తుతం బీజేపీ అభ్యర్థిగా తిరుపతి ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నారు.



వైసీపీ అత్యుత్సాహానికి విద్యుత్ పరికరాల దగ్ధం



కాలిపోయిన విద్యుత్ కేబుళ్లు, మీటర్ బాక్సులు

→ శుక్రవారం స్టోర్స్‌లో అగ్నికి ఆహుతవుతున్న విద్యుత్ పరికరాలు

- స్టోర్‌లో దగ్ధమైన కేబుళ్లు, మీటరు బాక్సులు
- రూ.కోటి వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా
- గోప్యంగా ఉంచిన ఎస్పీడీసీఎల్ అధికారులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 6: అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పేల్చిన టపాసుల నిప్పురవ్వలు పడి ఎస్పీడీసీఎల్ స్టోర్‌లో విలువైన పరికరాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.కోటి మేర నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేసిన ఈ ప్రమాదాన్ని ఆ శాఖ అధికారులే గోప్యంగా వుంచడం గమనార్హం. విశ్వసనీయవర్గాల వివరాల మేరకు..చిత్తూరు గిరింపేటలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ నాయకులు టపాకాయలు పేల్చారు. వాటినుంచి వచ్చిన నిప్పురవ్వలు పక్కనే ఉన్న విద్యుత్ స్టోర్‌లో పడి అక్కడున్న విద్యుత్ కేబుళ్లు, మీటర్ బాక్సులు, ఇతర పరికరాలు దగ్ధమయ్యాయి. దీనివల్ల రూ.కోటి వరకు నష్టం జరిగినట్లు అంచనా వేసిన అధికారులు ప్రమాదాన్ని గోప్యంగా వుంచడంపై అందరూ నివ్వెరపోతున్నారు.పైగా గుర్తుతెలియని వ్యక్తులు టపాకాయలు పేల్చడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులకు విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. కాగా శనివారం అగ్నిప్రమాదం జరిగిన స్టోర్‌ను ఎస్పీడీసీఎల్ సీజీఎం చలపతి, ఎస్ఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. ప్రమాద వివరాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజీఎం పర్యటనను కూడా అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

టమోటా ధరలు ఆశాజనకం



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న టమోటాలు

సోమల, ఏప్రిల్ 6: టమోటా ధరలు ఆశాజనకంగా మారుతున్నాయి. శనివారం 15కిలోల బాక్సు ధర రూ.360కి చేరుకోవడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కిలో రూ.24 చేరుకుంది. నెలగా 15కిలోల బాక్సు రూ.200లోపు ఉండేది. ఎండల తీవ్రతతో టమోటా సాగు కష్టంగా మారింది. ఇతర జిల్లాల్లోనూ సాగు తగ్గిపోయి డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో జిల్లాలోని సోమల, పుంగనూరు, చౌడేపల్లె, పలమనేరు, సదుం తదితర ప్రాంతాల్లో దిగుబడులు ప్రారంభమయ్యాయి. దీంతో వ్యాపారులు కూడా పలమనేరు, పుంగనూరు, మదనపల్లె మార్కెట్లకు రావడంతో ధరలు పుంజుకునే పరిస్థితి ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌కి 10 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 6: జిల్లాలో జేఈఈ మెయిన్స్ సెషన్-2 పరీక్షలు మూడో రోజైన శనివారం కూడా కొనసాగాయి. వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్ష కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో 171 మందికిగాను 161 మంది హాజరవగా, 10 మంది గైర్హాజరైనట్లు సిటీ కో-ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

కల్లూరు అడవిలో చిరుత సంచారం!

కల్లూరు, ఏప్రిల్ 6: పులిచెర్ల మండలం కల్లూరు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లెకు వెళ్లే అడవిమార్గంలో శనివారం రాత్రి చిరుతపులి సంచరించడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన కొందరు కారులో కల్లూరుకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు హైవే రోడ్డు దాటుకొని కొమ్మిరెడ్డిగారిపల్లె వైపు వెళుతుండగా రాత్రి ఏడు గంటల సమయంలో ఒక్కసారిగా చిరుతపులి రోడ్డును దాటడంతో కారులో వెళుతున్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. చిరుత సంచారంపై స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తన సిబ్బందితో చిరుతపులి సంచరించిన ప్రాంతానికి చేరుకుని, పరిశీలించారు. రహదారిపై వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

4,900 మొబైల్స్ వెనక్కిచ్చేసిన వలంటీర్లు

బయోమెట్రిక్ డివైజ్‌లు, ఇతర ఉపకరణాలు కూడా..

కొనసాగుతున్న అప్పగింతలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 6: వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్స్, ఇతర ఉపకరణాలు కలెక్టర్ వద్ద డిపాజిట్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలో 612 వార్డు, గ్రామ సచివాలయాల్లో 9,400 మంది వలంటీర్లు ఉండగా, ఇప్పటి వరకు 4,900 మంది మొబైల్స్ వెనక్కిచ్చేశారు. వీటిలో 1,674 పనిచేయడం లేదు. 4,580 బయోమెట్రిక్ డివైజ్‌లు అప్పగించారు. అలాగే 148 ఐరిష్ ఉపకరణాలను కూడా ఇచ్చేయగా, 60 మరమ్మతులకు గురయ్యాయి. 5,100 సిమ్‌కార్డులు వెనక్కి రాగా, 428 పనిచేయడం లేదు. మిగిలినవి కూడా అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది.

భగ్గుమన్న భానుడు



ఎండ తీవ్రతకు బోసిపోయిన చిత్తూరులోని ఎమ్మెస్సార్ సర్కిల్

- వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి
- తవణంపల్లెలో అత్యధికంగా 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మరో మూడ్రోజులు ఇదే పరిస్థితి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 6: భానుడు ఉగ్రంగా మారి, నిప్పులు కురిపిస్తున్నాడు. శనివారం మరింత ఎండ పెరగడంతోపాటు వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు కూడా అధికంగా నమోదవుతున్నాయి. వాతావరణంలో పెనుమార్పులే దీనికి కారణమని శాస్త్రవేత్తలు అంటున్నారు. మరో మూడ్రోజులపాటూ ఎండలు ఇలాగే ఉంటాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 31 మండలాల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలిలా ఉన్నాయి. తవణంపల్లెలో 43.7, పులిచెర్లలో 43.6, శ్రీరంగరాజపురం, విజయపురంలో 42.9, నగరి, నింద్రలో 42.8, బంగారుపాళ్యం, పుంగనూరులో 41.5, సోమలలో 41.4, చిత్తూరు, సదుంలో 41.2, గుడిపాల, పాలసముద్రంలో 41.0, కుప్పంలో 40.9, ఐరాల, యాదమరి, చౌడేపల్లె, రొంపిచెర్లలో 40.8, గంగాధరనెల్లూరు, వెదురుకుప్పంలో 40.7, కార్వేటినగరంలో 40.0, గుడుపల్లెలో 39.9, పెనుమూరు, పలమనేరు, శాంతిపురంలో 39.8, గంగవరం, పూతలపట్టులో 39.3, పెద్దపంజాణిలో 39.2, వి.కోటలో 39.0, రామకుప్పంలో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వలంటీర్లే వైసీపీ నేతలు

- కుండ బద్దలుకొట్టిన ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఏప్రిల్ 6: 'వలంటీర్లే ఇక వైసీపీ నాయకులు. వారే జగన్‌ను గెలిపించుకుంటారు' అని ఎమ్మెల్సీ భరత్ తెర తొలగించి.. నిజం చెప్పేశారు. కుప్పం మండలంలోని 354 మంది వలంటీర్లలో 326 మందితో రాజీనామాలు చేయించిన సందర్భంగా శనివారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎంపీడీవో ఖాదర్ బాషాకు తమ రాజీనామా పత్రాలను అందజేసిన వలంటీర్లు కూడా అచ్చం ఆయనలాగే రాజకీయ మాటలు మాట్లాడారు. కాగా, కుప్పం పురపాలక సంఘం పరిధిలోని సామగుట్టపల్లె సచివాలయం వలంటీర్లు 20 మంది కూడా రాజీనామాలను మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావుకు సమర్పించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.30

సహరి (సోమవారం) : ఉ. 4.44

దోషం దందా..!

రాహు-కేతు పూజల్లో ఆగని బలవంతపు వసూళ్లు

శ్రీకాళహస్తీశ్వరుడి ఆలయంలో ఐదేళ్లుగా అంతులేని అవినీతి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదేళ్లుగా అవినీతికి అంతే లేకుండా పోయింది. ప్రత్యేకించి రాహు-కేతు పూజల్లో భక్తుల నుంచి బలవంతపు వసూళ్లు విచ్చలవిడిగా సాగిస్తూనే ఉన్నారు. ఈ ఒక్క విభాగంలోనే రూ.50 కోట్లకుపైగా అక్రమ సొమ్మును పోగేసి.. వాటాలు వేసుకుని మరీ పంచుకున్నారు. నిత్యం ఇది బాహాటంగా జరుగుతూనే ఉన్నా ఏ ఒక్క అధికారి కూడా ఈ అక్రమ వసూళ్లను అడ్డుకోలేదన్న అపవాదు నేటికీ కొనసాగుతూనే ఉంది.

\- శ్రీకాళహస్తి



రూ.500 రాహు-కేతు పూజలు చేసుకుంటున్న భక్తులు

గ్రహణకాల సమయంలో అన్నిచోట్లా ఆలయాలను మూత వేసి.. విడుపు తర్వాత తిరిగి తెరుస్తుంటారు. కానీ శ్రీకాళహస్తిలో నవగ్రహాలను కవచంగా ధరించి కొలువుదీరిన వాయులింగేశ్వరుడికి అన్ని గ్రహణకాల సమయాల్లోనూ విశేషంగా అభిషేకాలు నిర్వహిస్తుంటారు. అంతేకాకుండా ఈ సమయంలో ఆలయాన్ని తెరచి భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పిస్తుంటారు. ఈ గ్రహణ కాల అభిషేకాలను దర్శించుకోవడానికి విశేషంగా భక్తులు తరలివస్తారు. ఇంతటి మహిమాన్విత క్షేత్రం కావడంతో ముక్కంటి ఆలయంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. ఇటీవల దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో రాహు-కేతు పూజలు చేసుకునేందుకు విచ్చేస్తున్నారు.

దక్షిణ పెడితేనే దోషం పోతుందంటూ..

ఆలయంలో రాహు- కేతు పూజలను ఐదు ధరల టికెట్లపై నిర్వహిస్తుంటారు. రూ.500, రూ.750, రూ.1500, రూ.2500, రూ.5000 టికెట్లుగా విభజించి ఆయా మండపాల్లో బ్యాచ్‌ల వారీగా పూజలు చేస్తుంటారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రోజూ ఈ పూజలు జరుగుతూనే ఉంటాయి. మండపాల్లో ఆశీనులైన భక్తులతో సామూహికంగా సంకల్పాన్ని మైక్‌లో అనౌన్స్ చేస్తూ రాహు-కేతు పూజలు జరిపిస్తారు. ఇదే మైక్ నుంచే ప్రతి ఒక్కరూ.. దక్షిణ ఇస్తేనే మీ దోషం పోతుందంటూ భక్తులను మానసికంగా భయపెడుతున్నారు. రూ.2,500 పూజలో అయితే రూ.201, రూ.5,000 పూజలో అయితే రూ.501 దక్షిణ పెట్టాలంటూ బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఆలయంలో నెలకు అన్నిరకాల టికెట్లు కలిపి మొత్తం సుమారు లక్ష రాహు-కేతు పూజలు జరుగుతాయని అంచనా. అంటే సగటున రూ.100 చొప్పున లెక్కేసినా నెలకు రూ.కోటి సునాయాసంగా పోగేస్తున్నారు. అంటే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.50 కోట్లకు ఈ దందా చేరిందన్నమాట. ఈ అక్రమ సొమ్మును నియోజకవర్గ ముఖ్య నేత నుంచి, కిందిస్థాయి ఆలయ సిబ్బంది వరకు బొక్కేస్తున్నారన్న విమర్శలున్నాయి.

భక్తులు నిలదీసినా..

ఈ అక్రమ వసూళ్లపై పలుమార్లు భక్తులు నిలదీశారు. దీనిపై లిఖితపూర్వకంగా దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అంతేకాకుండా ఇలా మండపాల్లో అక్రమ వసూళ్లపై నిలదీసిన భక్తులను కొన్ని సందర్భాల్లో ఆలయ ఉద్యోగులు చేయి చేసుకున్న ఘటనలు కూడా వెలుగు చూశాయి.

ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరించినా..

బలవంతపు వసూళ్లు చేయడం మంచి పద్ధతి కాదని ఎందరో ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరించారు. ఏడాది క్రితం విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆలయాన్ని దర్శించుకున్నారు. బహిరంగంగా మీడియా ఎదుటే రాహు-కేతు పూజల్లో వసూళ్లు తగదంటూ పాలకులకు, అధికారులకు హితవు పలికారు.

పుంగనూరుపై సీఈసీ కన్ను

- 182 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- తన ఫిర్యాదుపై చర్యలు తీసుకుందన్న బీసీవై అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, ఏప్రిల్ 6: పుంగనూరు నియోజకవర్గంలోని అత్యంత సమస్యాత్మకమైన 182 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌తోబాటు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్నట్లు భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28వ తేది కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు పుంగనూరులో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహణకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర సాయుధ బలగాలు ఏర్పాటు చేయాలని, వైసీపీ ముఖ్యనేత మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికార దుర్వినియోగం, తిరుపతి ఉప ఎన్నికల్లో అక్రమాలకు ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారని ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి.. విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ వివరణ ఇస్తూ సీఈవోకు లేఖ రాశారన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో మొత్తం 262 పోలింగ్ స్టేషన్లకుగానూ 182పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ఆ పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్‌గా గుర్తించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారని తెలిపారు. పోలింగ్ జరిగే రోజు ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శనివారం తనకు రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వి.కోటేశ్వరరావు లేఖ పంపారని వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం తన ఫిర్యాదుపై స్పందించడం తొలి విజయమని, పుంగనూరులో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర బలగాలు రావడం జరుగుతుందన్నారు.

టీడీఆర్ బాండ్లపై ఇప్పుడేమంటారు ?

● రూ.4వేల కోట్ల అవినీతిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
● నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం డిమాండు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 6 : తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లకోసం జారీ చేసిన టీడీఆర్ బాండ్లను ఆపేయాలని ప్రభుత్వమే నోటీసులు జారీ చేయడంతో తాము గతంలో ఆరోపించిన అవినీతి విషయాలను అంగీకరించినట్లయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తెలిపారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.బాండ్ల జారీ విషయంలో రూ.10వేల కోట్ల అవినీతికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి పాల్పడ్డారని గతంలో తాను వెల్లడించానన్నారు. అప్పుడు నోరు మెదపని వారు ఇప్పుడు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఇచ్చిన నోటీసులకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 17 రోడ్ల కోసం 376 టీడీఆర్ బాండ్లు తయారు చేసి రూ.4వేల కోట్ల అవినీతికి శ్రీకారం చుట్టారని ఆనం ఆరోపించారు. ఇందులో రూ.2వేల కోట్లు ఇప్పటికే బాండ్ల రూపంలో కొనుగోలు చేశారని వెల్లడించారు. జరిగిన అవినీతిపై విచారణ చేయించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కరుణాకరరెడ్డి, అభినయరెడ్డిపై రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చేస్తారా అని ప్రశ్నించారు. ఇందులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత కూడా అవినీతిలో భాగస్తులేనన్నారు. గత ఆర్డీవో నరసారెడ్డి, రిజిస్ట్రార్, సర్వేయర్‌లకు కూడా ఇందులో ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. మరో 2 నెలల్లో టీడీపీ అధికారంలోకి రావటం ఖాయమని, టీడీఆర్ బాండ్ల జారీపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని ఆనం హెచ్చరించారు. భూములు ఇచ్చి నష్టపోయిన బాధితులకు తమ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.


ఆనం వెంకటరమణారెడ్డి

కల్లూరు సంఘమిత్రపై టీడీపీ నేతల ఫిర్యాదు

కల్లూరు, ఏప్రిల్ 6: పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీకి చెందిన సంఘమిత్ర ఎస్. పర్వీన్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించిందంటూ రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ, నియోజకవర్గ టీడీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు నూర్‌బాషా శనివారం ఎంపీడీవో సురేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఈనెల 3వ తేదీన సీఎం జగన్ కల్లూరులో బస్సుయాత్ర చేపట్టారు. ఈ బస్సుయాత్రకు డ్వాక్రా మహిళలు హాజరు కావాలని ఫోన్ ద్వారా సంఘమిత్ర పర్వీన్ గట్టిగా ఆదేశించిందని, దీంతోపాటు వాట్సాప్ గ్రూపులో వైసీపీకి అనుకూలంగా సీఎం జగన్ వీడియో సందేశం పెట్టిందని టీడీపీ నేతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సంఘమిత్ర ఎస్.పర్వీన్ ద్వారా వివరణ తీసుకొని నియోజకవర్గం ఎన్నికల అధికారి మధుసూదన్‌రెడ్డికి పంపినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీఎం మధుసూదన్ తెలిపారు.


ఎంపీడీవోకు టీడీపీ నాయకులు సమర్పించిన వాట్సాప్ సందేశం

ఇంటింటా ప్రచారం చేయలేను : పెద్దిరెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 6: ఎన్నికల్లో రాయలసీమ ప్రాంతంలోని వైసీపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనపై ఉండటంతో పుంగనూరు నియోజకవర్గంలో ఇంటింటా ప్రచారం చేయలేక పోతున్నట్లు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పుంగనూరు మండలంలో ఎన్నికల ప్రచారంలో ఈ విషయం చెప్పారు. తన తరపున పార్టీ నేతలు ప్రచారాలు చేస్తారన్నారు.

బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం

పలమనేరు, ఏప్రిల్ 6: పలమనేరు-కుప్పం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో శ్రీనాథరెడ్డి మృతి చెందాడు. బైరెడ్డిపల్లె మండలం మోట్లపల్లికి చెందిన సుధాకరరెడ్డి కుమారుడు శ్రీనాథరెడ్డి బేలుపల్లికి వెళ్లి తిరిగి మోటరు సైకిల్‌పై వస్తుండగా ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. మోటరు సైకిల్ తుక్కుతుక్కు అయింది. ఎస్ఐ శివశంకర్ తన సిబ్బందితో చేరుకుని శ్రీనాథ్‌రెడ్డి మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన శ్రీనాథ్‌రెడ్డి

ఆస్పత్రిని తనిఖీ చేసిన అడిషనల్ డీఎంహెచ్‌వో

బంగారుపాళ్యం, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని వైద్యవిధాన పరిషత్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ పరీక్షా కేంద్రాన్ని, క్షయ నివారణ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎయిడ్స్‌పై విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఎయిడ్స్ కౌన్సిలర్ డాక్టర్ బాబుకు సూచించారు. వైద్యాధికారులు సమయపాలన పాటించని యెడల కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అయోధ్యకాండ పారాయణం




తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై శనివారం ఉదయం జరిగిన తొమ్మిదివ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. అయోధ్యకాండలోని 31 నుంచి 34వ సర్గల్లోని 172 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 197 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్య, అనంత, మారుతి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. పలు కీర్తనలను రసరమ్యంగా ఆలపించారు.

మామండూరులో ఏనుగుల విధ్వంసం



రేణిగుంట మండలం మామండూరు అటవీప్రాంతానికి అనుకుని ఉన్న మామిడితోపులో శనివారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించింది. ఏనుగుల సంచారాన్ని గుర్తించిన స్థానికులు బాణాసంచా పేలుళ్లతో బెదిరించే ప్రయత్నం చేశారు. అయితే ఏనుగులు మామిడితోపు నుంచి వెళ్లకపోవడంతో గ్రామస్తులు వాటి దిశ మార్చి ఉదయం బయటకు పంపగలిగారు.బాధిత రైతు మురళి మాట్లాడుతూ ఏనుగుల గుంపుతో నష్టపోతున్న విషయమై గతంలో అటవీశాఖ అధికారులకు తెలియజేస్తే స్పందించలేదన్నారు. కేవలం ఫొటోలు తీసుకుని వెళ్లడం తప్ప సాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మామిడితోపులకు ముందు ఏనుగులు రాకుండా ఏర్పాటు చేసిన గుంతలు పూడిపోయిన విషయాన్ని కూడా గతంలో అటవీశాఖ అధికారులకు చెబితే ఏఎఫ్‌వోను పంపి చేతులు దులుపుకున్నారని వాపోయారు.ఇప్పటికైనా ఏనుగుల దాడుల నుంచి రక్షణ కల్పించాలని, అలాగే నష్టపోయిన తమ పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

- రేణిగుంట

స్వతంత్రానంతర ఎన్నికల చరిత్రలో తిరుపతిలో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థి బరిలో లేకుండా ఎన్నికలు జరగబోతున్నాయి. తిరుపతి ఎంపీ, అసెంబ్లీ స్థానాలను ఇండియా కూటమిలో భాగస్వాములైన మిత్రపక్షాలకు కేటాయించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. పార్లమెంటు స్థానాన్ని ఇప్పటికైతే ప్రకటించకపోయినా ఆర్పీఐకి కేటాయించినట్లు ఆ పార్టీ నాయకుడు అంజయ్య తెలిపారు. నిరంతరం జనంలో తిరిగే మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వంటి నాయకులున్న తిరుపతిలో ఇదేమి చిత్రమైన పరిస్థితి అని కాంగ్రెస్ అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అయ్యో పాపం కాంగ్రెస్!

● తిరుపతిలో ఆ పార్టీ లేకుండా తొలిసారి ఎన్నికలు జరగనున్నాయా?
● ఇండియా కూటమి మిత్రపక్షాల పేరుతో తెరవెనుక మంత్రాంగం నడిచిందా?
● చింతా మోహన్ పరిస్థితి ఏమిటి?

రాష్ట్ర విభజన తర్వాత జరిగిన 2014, 2019 ఎన్నికల్లో తిరుపతిలోనూ కాంగ్రెస్ పార్టీ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. అయినా ఆ పార్టీకి బలమైన అభిమానులున్నా వారంతా దాదాపుగా వైసీపీ నీడకిందకు చేరుకున్నారు. అయితే ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరగడం, ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల నియమితురాలు కావడం వంటి కారణాలతో కాంగ్రెస్‌లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఆ పార్టీకి రాష్ట్రంలోనే పెద్దదిక్కుల్లో ఒకరైన చింతా మోహన్ తిరుపతి కేంద్రంగానే రాజకీయ కార్యకలాపాలు నడుపుతుంటారు. కొవిడ్ రోజుల్లో తప్ప ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో జనంలో ఉంటున్నారు. 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ, 2021 ఉప ఎన్నికల్లోనూ ఆయన కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేశారు. అలాంటిది తిరుపతి ఎంపీ టికెట్ కోసం ఆయన గత వారం రోజులుగా ఢిల్లీలో మకాం వేయాల్సిన పరిస్థితి నెలకొందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తన కుమార్తె డాక్టర్ సీనాకు గూడూరు టికెట్ కోసం కూడా ఆయన ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఎంపీ సీటును ఆర్పీఐకి కేటాయించినది నిజమే అయితే చింతా రాజకీయ జీవితంలోనే ఇదో పెద్ద అవమానం కాగలదని అంటున్నారు. ఇక తిరుపతి అసెంబ్లీ సీటును సీపీఐకి కేటాయించడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి పోటీ చేస్తున్నారు. తిరుపతి నుంచి తమకు అవకాశం ఇవ్వాలని దొడ్డారెడ్డి రామ్‌ భూపాల్ రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే కోరారు కూడా. నవీన్‌కుమార్‌రెడ్డి నేరుగా షర్మిలను కలసి అభ్యర్థించారు. వీరందరినీ నిరాశ పరిచారు.

ఎవరికి మిత్రపక్షాలు?

ఈ నేపథ్యంలో తిరుపతిలో ఒక ప్రచారం బలంగా వినిపిస్తోంది. వైసీపీకి ప్రధాన అండగా ఉన్న రెడ్డి సామాజిక వర్గంలో చీలిక రాకుండా ఉండడానికే తిరుపతి టికెట్ ఆశించిన ముగ్గురికీ కాంగ్రెస్‌లో అవకాశం ఇవ్వలేదని అంటున్నారు. ఈ ముగ్గురూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. తిరుపతిలో బంధుబలగం ఉన్నవారు. ఖచ్చితంగా ఎంతోకొంత ఓట్లను చీలుస్తారు. అందుకే మిత్ర పక్షం అంటూ కేటాయించేశారని చెప్పుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనుక చాలా నడిచిందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఇంకో విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే.. అసెంబ్లీకి భూమన అభినయ్‌తో తలపడాల్సిన సీపీఐ నాయకుడు మురళి, ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నానని ప్రకటించిన అంజయ్య.. ఇద్దరూ భూమన కరుణాకరరెడ్డికి సన్నిహితులు కావడం. ఆయన తిరుపతిలో అద్భుతమైన అభివృద్ధి చేశారంటూ వీరు సమావేశాల్లో కీర్తించారు కూడా. భూమన కుటుంబానికి బాసటగా వీరు నిలబడ్డారు. మరి ఇటువంటి వారు భూమన అభినయరెడ్డితో తలపడడం ఎలా సాధ్యం అనే విమర్శ బలంగా వినిపిస్తోంది.

షిఫ్టు డ్యూటీల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 6: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో వివిధ విభాగాల నోడల్ ఆఫీసర్లు, వారి సిబ్బంది రోజుకు 8 గంటలు చొప్పున పనిచేసే విధంగా షిఫ్టు డ్యూటీలు ఏర్పాటు చేయడం జరిగిందని డీఆర్వో పుల్లయ్య అన్నారు. షిఫ్టుల్లో పనిచేసే వారు తప్పక తమతమ స్థానాల్లో ఉండాలని, డ్యూటీలో లేకుంటే కఠిన చర్యలు తప్పవని డీఆర్వో పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో రెండ్రోజుల క్రితం కొత్త స్పందన హాలులో ఏర్పాటు చేసిన ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ కలెక్టర్, జేసీ వంటి ఉన్నతాధికారులు కంట్రోల్ రూమ్‌ను అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలకు వచ్చే అవకాశముందని, అందువల్ల షిఫ్టు డ్యూటీలోని సిబ్బంది వారివారి విభాగాల వద్ద తప్పక ఉండాలన్నారు. అన్ని విభాగాలకు కంప్యూటర్ సిస్టం ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న డీఆర్వో పుల్లయ్య

సైకిల్‌కు ఓటేయండి

మలయాళీలకు నటుడు యువ పిలుపు

నగరి, ఏప్రిల్ 6: ఆంధ్రాలో ఉన్న మళయాళీలందరూ సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించాలని భగవంత్‌కేసరి సినిమాలో నటించిన నటుడు యువ పిలుపునిచ్చారు. నగరి పట్టణ పరిధిలో సామాలమ్మ గుడి వద్ద రామానుజం చలపతి ఆధ్వర్యంలో శనివారం జరిగిన పూజా కార్యక్రమంలో నటుడు యువ మొక్కులు తీర్చుకున్నారు. లత, అలిమేలు, కన్నెమ్మ, మణివన్నన్, అరుల్ పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని గో సంరక్షణ ట్రస్టుకు కడప జిల్లా పులివెందులకు చెందిన బాలాజి శనివారం రూ.1,00,116 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.


దాతకు విరాళాన్ని అందించిన పత్రాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

దారి దోపిడీ దొంగల అరెస్టు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 6: రాత్రివేళల్లో హైవేల్లో ఆగివున్న లారీలు, వాహనాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని తిమ్మోజిపల్లె వద్ద ఏప్రిల్ ఒకటో తేదీ రాత్రి సిమెంట్ లోడుతో ఆగివున్న లారీలో నిద్రిస్తున్న డ్రైవర్, క్లీనర్లను బెదిరించి వీరు దొంగతనానికి పాల్పడ్డారు. అదేవిధంగా శేషాపురం దాబా వద్ద ఆగివున్న లారీలో కూడా దొంగతనానికి పాల్పడ్డారు. లారీ డ్రైవర్లు ఫిర్యాదు చేయడంతో బంగారుపాళ్యం పోలీసులు శుక్రవారం చిత్తూరుకు చెందిన చంద్రు, గంగాధరనెల్లూరు మండలం కొళెపల్లికి చెందిన గోపీనాథ్, చిత్తూరు జెండామానువీధికి చెందిన దినకర్‌లను శుక్రవారం కేజీసత్రం వద్ద అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనపరచుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లో కష్టపడ్డా గుర్తించలేదు

మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు రాణి యాదవ్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీలో మహిళలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాణి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డానని తెలిపారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు పదవి తనకు ఇవ్వకుండా నిన్నమొన్న పార్టీలోకి వచ్చిన వారికి కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా పార్టీ గుర్తించలేదన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చందన పాల్గొన్నారు.

వైద్యులను కమిషనర్ అగౌరవపరుస్తున్నారు

● డీఎంహెచ్‌వోకు ప్రభుత్వ వైద్యుల సంఘం ఫిర్యాదు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 6: గత కొంత కాలంగా చిత్తూరు నగరపాలక సంస్థలో కమిషనర్ తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. రెగ్యులర్ ఎంహెచ్‌వోను తొలగించి ఆ స్థానంలో సాధారణ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించడంపై ప్రభుత్వ వైద్యుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. శనివారం చిత్తూరు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాజుకు ఫిర్యాదు చేశారు. నగరపాలక కమిషనర్ వైద్యులను అగౌరపరుస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూల్స్‌కు విరుద్ధంగా గ్యాడ్యుయేటెడ్ డాక్టర్ ఉండాల్సిన స్థానంలో ఒక సాధారణ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఎలా నియమిస్తారని అన్నారు. నగరపాలక సంస్థలో కీలకమైన, ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన స్థానాన్ని అవహేళన చేస్తున్నారని తెలిపారు. ఏదైనా ఓ ప్రాంతంలో రోగాలు ప్రబలితే అతను గుర్తించగలడా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు ఉందని చెప్పారు. డాక్టర్స్‌పైన కమిషనర్ వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. వెంటనే ఎంహెచ్‌వో స్థానంలో వైద్యుడిని నియమించాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఎల్లయ్య, జానకిరావు, మల్లికార్జున్, శిరీష, అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 59,621 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,351 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీకి కానుకగా ఎలక్ట్రిక్ బైక్

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి శనివారం ఓ ఎలక్ట్రిక్ బైక్ కానుకగా అందింది. పుణేకు చెందిన బిగాస్ ఆటోమొబైల్స్ ఎండీ హేమంత్ కాంద్రా, ఉపాధ్యక్షుడు సతీశెట్టితో కలిసి రూ.1.50 లక్షల విలువైన ద్విచక్ర వాహనాన్ని అందజేశారు. ఉదయం శ్రీవారి ఆలయం వద్ద వాహనానికి పూజలు చేయించి, బైక్ తాళాలను టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు అందజేశారు. డీఐ సుబ్రహ్మణం పాల్గొన్నారు.



తిరుమలలో గుర్తు తెలియని యువకుడి మృతి

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ వివరాల మేరకు.. తిరుమల హెచ్‌వీ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న అడవిలోని ఓ చెట్టుకు సుమారు 25 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు మృతదేహం వేలాడుతుండటాన్ని స్థానికులు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఉరేసుకుని ఉన్న ఆ యువకుడి మృతదేహాన్ని కిందకు దించి అశ్విని ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ నెల 3వ తేదీన ఆ యువకుడు రాంభగీచా వద్ద నడుచుకుంటూ వెళుతున్నట్టు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా గుర్తించారు. అతను ఎవరు, ఎక్కడి నుంచి ఎప్పుడు వచ్చాడనే అంశాలపై విచారణ జరుపుతున్నారు.



ఆరోగ్యసంరక్షణపై అవగాహన

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 6 : మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద శనివారం వైద్యాధికారి, వైద్యసిబ్బంది ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సురక్షితమైన తాగునీరు, స్వచ్ఛమైన గాలి, పోషకాహారం, శారీరక శ్రమ, నాణ్యమైన నివాసం తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బైరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి వ్యాధినిరోధక టీకాలు, పోషకాహార ప్రాముఖ్యత, రక్తహీనత, వ్యక్తిగత శుభ్రత, వడదెబ్బ నివారణ, సీజనల్‌వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్‌ఎం లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల, దీప, ఆశ కార్యకర్త ముబీనా పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



రొంపిచెర్ల, ఏప్రిల్ 6: పవిత్ర రంజాన్ మాసంలో బడేరాత్‌ను పురస్కరించుకుని శనివారం మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి ఇషా నమాజ్ నుంచి తెల్లవారుజామున సహేరి వేళ వరకు ముస్లింలు ఆధ్యాత్మికంగా గడిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బయానా, ఖురాన్, నమాజ్, దువాతో రాత్రంతా ఆరాధనల్లో గడిపి, తమ కష్టాలు అల్లాకు విన్నవించుకుని వాటిని దూరం చేయాలని మొరపెట్టుకున్నట్లు మత గురువులు అబ్దుల్ రహమాన్, ఆఫీజ్ సమీహుల్లా పేర్కొన్నారు.

కారును ఢీకొన్న లారీ : ఇద్దరికి గాయాలు

గంగవరం, ఏప్రిల్ 6 : పలమనేరు - మదనపల్లె రహదారిలో కల్లుపల్లె క్రాస్ వద్ద లారీ కారును ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పలమనేరు పట్టణం గంటావూరు బీసీ కాలనీకి చెందిన ఎం.షఫ్రుద్దీన్, షాజియాబేగం భార్యాభర్తలు. వీరు మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకోసం కారులో వెళ్లి తిరుగు ప్రయాణంలో కల్లుపల్లె క్రాస్ వద్ద వస్తుండగా ఎదురుగా ట్యాంకర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలవడంతో పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన కుప్పం నేతలు



రామకుప్పం, ఏప్రిల్ 6: జనసేన రాష్ట్ర పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను శనివారం కుప్పం నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు కలిసినట్లు జనసేన రామకుప్పం మండల అధ్యక్షుడు హరీష్ తెలిపారు. తెనాలిలో ఆయనను కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపామని ఆయన తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు భారీ మెజారిటీ అందించేందుకు జనసేన నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని తమకు సూచించారన్నారు. మనోహర్‌ను కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి రామ్మూర్తి, సంయుక్తకార్యదర్శి వేణు, గుడుపల్లె మండల అధ్యక్షుడు చంద్రు, రామకుప్పం మండల ప్రధానకార్యదర్శి భాస్కర్ ఉన్నారని ఆయన తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దిన వేడుకలు



పుంగనూరులో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పుంగనూరులో శనివారం ఆ పార్టీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమీందారు ప్యాలెస్ నుంచి బజారువీధి, తూర్పుమొగసాల, ఎంబీటీరోడ్డు, ఇందిరాసర్కిల్, ప్రైవేటుబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు స్కూటర్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం ఆర్థికాభివృద్ధిలో ముందుకు వెళుతున్నట్లు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మదన్‌మోహన్, రాజారెడ్డి, అయూబ్‌ఖాన్, శ్రీనివాసులు, విజయశంకర్, ఆదినారాయణ, పెద్దమఠం బాబు, పూల ప్రేమ్‌కుమార్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమించారని తహసీల్దార్‌కు ఫిర్యాదు



వి.కోట, ఏప్రిల్ 6: కృష్ణాపురం పంచాయతీ యడగురికి నుంచి ఎగువపల్లెకు వెళ్లే దారిని అదే గ్రామానికి చెందిన హనుమంతప్ప కుటుంబీకులు ఆక్రమించారని యడగురికి గ్రామస్తులు తహసీల్దార్ సురేష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ కాలంగా ఉన్న దారిని ఇటీవల వారి పొలంలో కలుపుకొని ఇతర పొలాలకు వెళ్లే వారికి దారి లేకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దారి ఆక్రమణపై విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

టీడీపీ నేత మృతిపై చల్లా బాబు సంతాపం



నివాళులర్పిస్తున్న టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి

సదుం, ఏప్రిల్ 6: సదుం మండలం తాటిగుంటపాలెం టీడీపీ నాయకుడు ఎర్రగుంట్ల మహేశ్వరరెడ్డి తండ్రి యర్రంరెడ్డి (80) శనివారం మృతి చెందడంతో పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. చౌడేపల్లె మండల పర్యటనలో ఉన్న చల్లా బాబుకు విషయం తెలియగానే తాటిగుంటపాలెం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబీకులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 6: గత నెల 29న పుంగనూరు-మదనపల్లె రోడ్డు మార్గంలోని అక్కింవారిపల్లె సమీపంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురు గాయపడినట్లు సురేశ్ తల్లి భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ జానకీరామ్ తెలిపారు. వలసపల్లికి చెందిన సురేశ్, దొరబాబు, నరేంద్రబాబులు ఈడిగపల్లె డాబాలో పని చేస్తుండేవారు. ఈ నేపథ్యంలో గత నెల 29న సొంత పనులపై పుంగనూరుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న కారును ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు అందించారు. శనివారం సురేశ్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

పుంగనూరు రూరల్, ఏప్రిల్6: పుంగనూరు సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వాసుదేవరావు విశాఖపట్నం మెట్రోపాలిటిన్ కోర్టుకు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా వాసుదేవరావును హైకోర్టు శనివారం బదిలీచేస్తూ ఉత్తర్వులు వెలుబడ్డాయి.

మైనార్టీలను మోసం చేసిన జగన్ : చల్లా



రొంపిచెర్లలో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 6: రాష్ట్రంలోని మైనార్టీ వర్గాలను సీఎం జగన్ మోసం చేశాడని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం రొంపిచెర్లలో మండల మైనార్టీ నాయకుల సమావేశంలో చల్లాబాబు మాట్లాడుతూ గతంలో టీడీపీ అమలు చేసే మైనార్టీ పథకాలను వైసీపీ ప్రభుత్వం విస్మరించి ఎన్నికల సమయంలో చెప్పిన ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు వంటి హామీలు మరిచారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. రాష్ట్ర టీడీపీ మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పఠాన్ అంజాద్ ఖాన్ మాట్లాడుతూ ఆదివారం రొంపిచెర్లలోని ఏడు మసీద్‌ల్లో చల్లారామచంద్రారెడ్డి రంజాన్ ఉపవాస దీక్షతులకు ఇఫ్తార్ విందు ఇస్తారని చెప్పారు. ఈ సమావేశంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి షేక్ కరీముల్లా, రాజంపేట పార్లమెంట్ తెలుగు మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జి. ఇమ్రాన్‌ఖాన్, నాయకులు అల్లాబకర్, కల్లూరు ఖాదర్‌బాషా, రఫీ, బాబులాల్, మొగల్ మహమ్మదాలి బేగ్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే నవ్యాంధ్ర పునర్నిర్మాణం

చౌడేపల్లె, ఏప్రిల్6:నవ్యాంధ్ర పునర్నిర్మాణం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యం అని చల్లా రామచంద్రరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని లద్దిగం, కొండయ్యగారి పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంక్షేమం, అభివృద్ధి, చంద్రబాబుకే సాధ్యం అన్నారు. సీఎం జగన్ సకాలంలో అవ్వాతాతలకు పింఛన్లు ఇవ్వడానికి చేతకాక టీడీపీపై నెపం వేశాడన్నాడు. టీడీపీ ప్రభుత్వం రాగానే ఈ ఏప్రిల్ నెల నుంచే రూ.4000 ఇస్తామన్నారు. అనివార్య కారణాలతో 3 నెలలపాటు పింఛన్ తీసుకోక పోయినా 3నెలల పింఛన్ కలిపి ఒకేసారి ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బావితరాల భవిషత్ కోసం టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, బోయకొండ సుబ్బు, జంపాల శ్రీనివాసులు నాయుడు, రెడ్డి, హరిప్రసాద్, ప్రభాకర్, చంద్రబాబు, కిరణ్‌కుమార్, వేమరాజు, గంగాప్రసాద్, నారాయణ, కుమార్‌రెడ్డి, మునెంకటప్ప, నాగరాజరెడ్డి, కల్యాణ్, మునిరాజ, గిరిరాజు, బాబునాయుడు,విజయభాస్కరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం టీడీపీని ఆదరించండి



సూపర్ సిక్స్ పథకాలపై అవగహన కల్పిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 6: రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరగాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ఆదరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి కోరారు. శనివారం రామకుప్పంలోని దిగువ వీధి, కుమ్మర వీధి, వైశ్య వీధుల్లో సూపర్ సిక్స్ పథకాల్ని ఇంటింటా వివరించారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయి ప్రజలకు రక్షణ కరువైందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగి పోయాయన్నారు. కుప్పం మరింత అభివృద్ధి చెందాలంటే టీడీపీని ఆదరించి చంద్రబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నేతలు రామకృష్ణప్ప, పద్మనాభ రెడ్డి, సలాంసాబ్, సుబ్రి, సతీష్, అవినాష్, మంజునాథ్, ఆదిల్ దయానంద్, అవినాష్, అమరనాథ్, నరహింహులు, సాగర్‌రెడ్డి, రమేష్, మురళి, బొరుగుల శీన, మునికృష్ణబాబు, అంజి, నిసార్, చలపతి, బాస్కర్ పాల్గొన్నారు.

కేఈసీలో కంటి పరీక్ష శిబిరం విజయవంతం



కేఈసీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కుప్పం, ఏప్రిల్ 6: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీదాకా నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైనట్లు బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. కేఈసీ ఎన్ఎస్ఎస్ విభాగం, కృష్ణగిరి లెన్స్ మేకర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 516 మంది బీటెక్ విద్యార్థులు, 94 మంది డిప్లమో విద్యార్థులు, 117 మంది బోధన, బోధనేతర సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నట్లు నాగరాజ్ ఆయన తెలిపారు. వీరికి వైద్యులు కంటిని కాపాడుకునే విధానాలను గురించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జె.మాధవన్, గంగాధరన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

యామిగానిపల్లెలో మహిళల ధర్నా



యామిగానిపల్లె ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గుడుపల్లె, ఏప్రిల్ 6: మండలంలోని యామిగానిపల్లెలో నీటి సమస్య పరిష్కరించాలని ప్రధాన రహదారిపై గ్రామస్తులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...యామిగానిపల్లెలో నెల రోజులుగా నీటి సమస్య నెలకొందని, అధికారులకు, నాయకులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. నిత్యం నీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటి తెచ్చుకొంటున్నామని వారు తెలిపారు. నీటి కోసం తమ కుటుంబాలు రోజూ కూలి పనులకు పోకుండా అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పారు. అధికారులు తమ నీటి సమస్య తెలిపినా వారు తీర్చకుండా కాలయాపన చేస్తున్నరని వారు వాపోయారు.ధర్నా చేస్తున్న వారి వద్దకు అధికారులు చేరుకొని నీటి సమస్య తీర్చుతామని చెప్పడంతో ధర్నా విరమించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఎనిమిది మందిపై కేసు నమోదు

కల్లూరు, ఏప్రిల్ 6: కల్లూరు మండలంలో ఇరువర్గాల మధ్య శనివారం జరిగిన ఘర్షణకు సంబంధించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెలో కొత్తపల్లెకు చెందిన నరసింహారెడ్డి తన సొంత స్థలంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఈ వాటర్ ప్లాంట్ ముందు ఏర్పాటు చేసిన పంచాయతీ తాగునీటి కుళాయి విషయమై నరసింహారెడ్డి చెన్నుపాటివారిపల్లెకు చెందిన రాఘవరెడ్డి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో ఇద్దరి తరపున రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం రావడంతో కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణలో తేజారెడ్డి, శ్రీకాంత్‌కు స్వల్పగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాలకు చెందిన నరసింహారెడ్డి, నవీన్‌రెడ్డి, తేజరెడ్డి, విజయలక్ష్మి, వంశీరెడ్డి, రాఘవరెడ్డి, కేశవులురెడ్డి, శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెన్నకేశవ స్వామికి అభిషేక పూజలు

సోమల, ఏప్రిల్ 6: సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామి మూలవిరాట్‌కు అభిషేక పూజలు జరిపారు. అలాగే చిన్నదేవళకుప్పంలోని శనీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు.

చెరువులో పడి కర్ణాటకవాసి మృతి



గుడుపల్లె, ఏప్రిల్6: ఈత కోసం స్నేహితులతో కలిసి చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి కర్ణాటకవాసి మృతి చెందిన ఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం వల్లురుకు చెందిన మంజూనాథ్ (38) తన స్నేహితులతో కలిసి శనివారం మధ్యాహ్నం మండలంలోని తమిళనాడు సరిహద్దు గ్రామమైన ఒఎన్ కొత్తూరు పెద్ద చెరువులోకి ఈత కోసం వచ్చారు. స్నేహితులు చెరువుకు కొంత దూరంలో ఉండగా మంజునాథ్ చెరువులో ఈత కొట్టడానికి ఒక్కడే వెళ్లాడు. మంజునాథ్‌కు ఈత రాకపోవడంతో చెరువు లోపలికి పోవడంతో నీటిలో మునిగిపోయాడు. కొంత సమయం తరువాత మంజునాథ్ జాడ కనిపించకపోవడంతో స్నేహితులు గట్టిగా కేకలు వేశారు. స్థానికులకు విషయం చెప్పారు. వారు అక్కడకు చేరుకొని చెరువులో గాలించి నీటిలో మునిగి మృతి చెందిన మంజునాథ్‌ను చెరువు నుంచి బయటకు తీశారు. ఆ తరువాత పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెరువుకు వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అనుమతి లేదని టీడీపీ ప్రచారాన్ని అడ్డుకున్న అధికారులు

పలమనేరు, ఏప్రిల్ 6 : పలమనేరు పాతపేట పోలీసు లైన్ వద్ద అనుమతి లేకుండా ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ కార్యకర్తలను శనివారం అధికారులు అడ్డుకొని అనుమతి తీసుకొని ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. దీంతో టీడీపీ కార్యకర్తలు ప్రచార కార్యక్రమాన్ని విరమించారు.

కర్ణాటక మద్యం పట్టివేత : ఒకరి అరెస్టు



రామకుప్పం, ఏప్రిల్ 6: మండలంలోని ఆరుమానిపెంట వద్ద ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.35వేల విలువైన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. ఎస్ఐ శివకుమార్ వివరాల మేరకు... ఎన్నికల నిఘాలో భాగంగా శనివారం పోలీసులు ఆరుమానిపెంటలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆరుమానిపెంటకు చెందిన లోకేష్ ద్విచక్ర వాహనంలో సంచిలో మద్యం ఉంచుకుని పోలీసులను గమనించి వాహనాన్ని వదిలి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు అతడిని వెంబడించి పట్టుకొన్నారు. సంచిని తనిఖీ చేయగా అందులో 358 ప్యాకెట్ల మద్యం బయటపడింది. మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. లోకేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

సోమలలో వీధి కుక్కల బెడద



సోమల, ఏప్రిల్ 6: మండల కేంద్రం సోమలలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పట్టణంలో ఎటు చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడుతున్నాయి. సోమల-నంజంపేట రహదారిలో తిరగాడుతూ పాదచారులపై దాడులు చేస్తున్నాయి. ఈ మార్గంలోనే పాఠశాల ఉండడంతో విద్యార్థులు బడికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రు బడి వరకు వచ్చి, తిరిగి తీసుకుపోతున్నారు. దీంతోపాటు బస్టాండ్ ప్రాంతంలో కోతుల బెడద ఉండి దుకాణాల్లో తినుబండారాలు తస్కరించుకుపోతున్నాయి. స్థానిక పంచాయతీ పాలక వర్గం వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేటి ఓటు రేపటి భవిష్యత్తు

చిత్తూరు, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ స్వీప్ నోడల్ బృందం శనివారం మహిళలకు సూచించారు. ఓటు హక్కు వినియోగంపై నగరంలోని 21వ డివిజన్‌లోని కుక్కలపల్లె, లక్ష్మయ్యవూరు ధర్మరాజులుగుడి వద్ద నోడల్ బృందం ఓటు హక్కు ప్రాధాన్యత, ఎథికల్ ఓటింగ్, ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. నగరంలో కళాజాతా బృందాలతో దొడ్డిపల్లె ఉన్నత పాఠశాల, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో ఓటర్ల చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీఈఎస్‌లో ఉద్యోగావకాశాలు

కుప్పం, ఏప్రిల్ 6: కుప్పం పీఈఎస్ ఆసుపత్రిలో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎన్.కే.సుబ్రహ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హత కలిగిన 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువతకు ఉపాధి కల్పించాలనే సత్సంకల్పంతో ఉద్యోగ శిక్షణ ఉచితంగా ఇస్తామన్నారు. తామిచ్చే ఉపాధి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆసుపత్రిలోని వివిధ విభాగాలలో సహాయకులుగా నియమిస్తామని చెప్పారు. శిక్షణ కాలంలో శిక్షణ భృతి కూడా ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం ఆసుపత్రి హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌ల 9701342724 అనే మొబైల్ నెంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

శేషాద్రిస్వామికి విశేష పూజలు



బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 6 : పట్టణంలోవున్న శేషాద్రిస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు తిప్పయ్యాచార్యులు స్వామికి విశేషాలంకరణచేసి ప్రత్యేకపూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కలశ పూజ, అభిషేకం, అర్చనలు చేశారు. అర్చకులు హరిస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శాంతి స్వరూప్‌కు ఘన నివాళి



రొంపిచెర్ల, ఏప్రిల్ 6: తొలి తెలుగు యాంకర్, దూరదర్శన్ తెలుగుభాష న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ అస్తమయాన్ని పురస్కరించుకుని రొంపిచెర్ల మండల మీడియా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శాంతిస్వరూప్ వార్తలు, సమాచారం, జాబులు-జవాబులు, ధర్మసందేహాలులాంటి కార్యక్రమాలు గుర్తుండేలా నిర్వహించాలని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టరు రఘునాథ్, రొంపిచెర్ల మీడియా కో-ఆర్డినేటర్ మల్లేపల్లి వెంకటేష్, సీనియర్ సిటిజన్ రాజన్న, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు



రామకుప్పం, ఏప్రిల్ 6: పట్టణ శివారులోని శనీశ్వర స్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు జరిగాయి. ఉదయం స్వామికి తైలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేశా రు. భక్తులు ఆలయం ఎదుట అఖిలాండం వద్ద నువ్వుల దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకొన్నారు. అదే విధంగా పక్కనే సుబ్రహ్మణ్య స్వామి, నాగులమ్మ, పద్మావతి, వేంకటేశ్వర స్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

నేడు అనిగానూరులో బీసీ సదస్సు

రామకుప్పం, ఏప్రిల్ 6: మండలంలోని అనిగానూరులో ఆదివారం బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు ఆనందరెడ్డి, నరహింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కార్యదర్శి నారాయణ ఆచారి, తెలుగు యువత మండల అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. శనివారం సదస్సు సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ... స్థానిక వాసవి కలాణ్య మండపంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సదస్సుకు నాలుగు క్లస్టర్ పరిధిలోని బీసీ నేతలు, కార్యకర్తలు ప్రజలు తప్పక హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో నేతలు రామమూర్తి, మనోహర్, వేలు, గజేంద్ర, నాగభూషణ, కుమార్, జేయి, ప్రకాష్, వేణుగోపాల్ గేడ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన టీడీపీ నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 6: మండలంలోని లింగాపురం, ఎస్.గొల్లపల్లె గ్రామాలకు చెందిన రెహమాన్, గోపి కొంత మంది మాయమాటలు చెప్పి వారికి ఇష్టం లేకపోయినా వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే వారికి టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌లు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు వెంకటాచలం, విజయ్‌కుమార్ రెడ్డి, ఆదిల్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాస్కర్. సలాంలె పాల్గొన్నారు.

సోమల మండలంలో 80 మంది వలంటీర్ల రాజీనామా

సోమల, ఏప్రిల్ 6: సోమల మండలంలోని 80 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా లేఖలు కార్యదర్శులకు అందజేశారు.

చౌడేపల్లెలో 37 మంది

చౌడేపలె, ఏప్రిల్ 6: చౌడేపల్లె మండలంలో 37 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. .సచివాలయం-1,2 పరిధిలోని వాలంటీర్లు రాజీనామాలు సమర్పించినట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ శనివారం తెలిపారు.

కల్లూరులో 9 మంది

కల్లూరు, ఏప్రిల్ 6: పులిచెర్ల మండలం కమ్మపల్లె పంచాయతీలోని 9 మంది వలంటీర్లు శనివారం సాయంత్రం రాజీనామా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరి రాజీనామాలను ఎంపీడీవో ఆమోదానికి పంపినట్లు తెలిపారు.

పుంగనూరులో 10మంది

పుంగనూరు, ఏప్రిల్ 6: పుంగనూరు 30వ మున్సిపల్ వార్డు తాటిమాకులపాళ్యంకు చెందిన 10మంది వార్డు వలంటీర్లు తమ రాజీనామా లేఖలను మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డికి అందజేశారు.

పలమనేరులో 12 మంది

పలమనేరు, ఏప్రిల్6 : మున్సిపాలిటీలో శనివారం 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. 19వ వార్డు పరిధిలో పనిచేస్తున్న 12 మంది వలంటీర్లు శనివారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి తమ రాజీనామాలను అందజేశారు. వలంటీర్లు రాజీనామా చేసిన అంశం కలెక్టరు దృష్టికి తీసుకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

ఇంటర్వ్యూ

నాన్నలా.. పిలిస్తే పలుకుతా!

గాలి భానుప్రకాష్



పిలిస్తే పలికే నాయకుడిగా ముద్దుకృష్ణమకు ఉన్న పేరును మరిపించేలా నిరంతరం నగరి నియోజకవర్గ ప్రజల్లో కనిపిస్తుంటారు ఆయన కుమారుడు గాలి భానుప్రకాష్. అవ్వా.. తాతా.. అక్కా.. అన్నా.. అని ప్రతి మనిషినీ పలకరిస్తూ, ప్రజల కష్టసుఖాలు పంచుకుంటూ ఆయన రాజకీయ ప్రయాణం కొనసాగుతోంది. 2019లో అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన ఆయన ఈసారి మరింత జనశక్తితో టీడీపీ అభ్యర్థిగా పోటీకి దిగుతున్నారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఆలోచనలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

- పుత్తూరు అర్బన్

బాబు బాటలో, లోకేష్ మార్గదర్శకత్వంలో..

రానున్న ఐదేళ్లల్లో నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అవసరమైన కార్యాచరణకు సంబంధించి స్పష్టమైన అవగాహనతో ఉన్నాను.. ఇందుకుగాను స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగుతాను. అభివృద్ధికి చంద్రబాబునాయుడు బ్రాండ్ అంబాసిడర్. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ నగరి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాను. నారా లోకేష్ నాకు మార్గదర్శి పడిలేచిన కెరటంలా ఈ ఐదేళ్లలో ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం.

"టీడీపీ అధికారంలోకి వస్తే వేణుగోపాలసాగర్‌తో పాటు 0.5 టీఎంసీల సామర్థ్యంతో వేపగుంట రిజర్వాయర్, 0.88 టీఎంసీల సామర్థ్యం గల అడవికొత్తూరు రిజర్వాయర్ కూడా పూర్తి చేస్తాం."

ఇవీ నా తొలి ప్రాధాన్యాలు

ప్రతి గ్రామానికీ రోడ్డు, ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యుత్తు, ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు కల్పించడమే తొలి ప్రాధాన్యంగా పెట్టుకుని పని చేస్తాను. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించి పల్లెల ఉసురు తీసింది. గ్రామాల అభివృద్ధి పూర్తిగా పడకేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు, డ్రైనేజీలు తప్ప ఈ ఐదేళ్లలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనీ చేయలేదు. సొంత పార్టీ కార్యకర్తలకు దోచిపెట్టే పనులు మాత్రమే చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పుత్తూరు, నగరి మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి, మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాను.

ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా

నాన్న ముద్దుకృష్ణమ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పుత్తూరులో డిగ్రీ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయి. వందల సంఖ్యలో పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు పుత్తూరులో ఇన్ని స్కూల్స్ కళాశాలలు ఉన్నాయంటే అందుకు ముద్దుకృష్ణమ వేసిన పునాదే కారణం. ఈ ఐదేళ్లలో నాడు-నేడు అని పేరుచెప్పి ఉన్న స్కూళ్లను మూసివేశారు. మారుమూల గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తాం. నియోజకవర్గవ్యాప్తంగా అవసరమైన చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వాటి బలోపేతానికి కృషి చేస్తాను. పుత్తూరులో పీజీ సెంటర్, మైనార్టీ విద్యార్థుల కోసం ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేస్తాను. తిరుపతి తరువాత నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు పనిచేస్తాను.

వారసత్వంగా ప్రజాసేవ

నాన్న ముద్దుకృష్ణమ నాయుడి నుంచి పేద ప్రజలకు సేవ చేయడం నాకు వారసత్వంగా వచ్చింది.ప్రజాప్రతినిధిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు, స్థానం ఉన్నాయి. ఆయన నడిచిన బాటలోనే నేనూ రాజకీయాల్లోకి వచ్చాను. సేవ చేయడంలో మా నాన్నకున్న అకుంఠిత దీక్ష, కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడంలో ఆయనకున్న చిత్తశుద్ధి, తనను నమ్ముకున్న వాళ్ల కోసం, తాను నమ్మిన వాళ్ల కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తించి స్వర్గీయ ఎన్టీఆర్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించారు. ఎన్టీఆర్ ఆశయాలను వమ్ము చేయకుండా రాష్ట్రం కోసం, నియోజకవర్గ ప్రజల కోసం ముద్దుకృష్ణమనాయుడు ఆయన జీవితంలోని చివరి రోజు వరకు కృషి చేశారు. విలువలతో కూడిన రాజకీయాలనే చేశారు. ఒకరిద్దరు అధికారులు చేసిన తప్పుకు పేపర్ లీక్ అయ్యిందనే కారణంతో నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించిన మహావ్యక్తి ముద్దుకృష్ణమ నాయుడు. ఆయన కుమారుడిగా విలువలు, నైతికతతో కూడిన రాజకీయాలు చేస్తాను....పేదల పక్షపాతిగా పనిచేస్తాను. పిలిస్తే పలికే నాయకుడిగా ముద్దుకృష్ణమకు ఉన్న పేరును మరిపించేలా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటాను.ఒక్క మాటలో చెప్పాలంటే నియోజకవర్గానికి, నమ్మి ఓట్లేయనున్న ప్రజలకు ప్రథమ సేవకుడిగా పనిచేస్తాను.

పవర్‌లూమ్స్‌కు పూర్వవైభవం

నియోజకవర్గంలో సుమారు 30 వేల మందికి పైగా పవర్‌లూమ్స్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ రంగం గిట్టుబాటు కాక కూలి పనికి వెళుతున్నారు. వైసీపీ ప్రభుత్వం పవర్‌లూమ్స్ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదు. తిరిగి ఈ రంగం పూర్వవైభవం సాధించేందుకు ప్రభుత్వపరంగా రాయితీలు కల్పించేందుకు కృషి చేస్తాను. ఇప్పటికే చంద్రబాబు నాయుడు నగరి పర్యటనలో పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రకటించారు. ఈ హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే ఖచ్చితంగా అమలు చేస్తాము. అలాగే పవర్‌లూమ్స్‌లో తయారయ్యే వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ విద్యార్థులకు యూనిఫాం, ఆసుపత్రులు, ప్రభుత్వ రంగంలో పనిచేసే కార్మికులకు అందించే విధంగా ప్రయత్నిస్తాను. కార్మికుల పనివిధానంలో మార్పులు వచ్చే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాను.

గాలేరు నగరి పూర్తి చేస్తాం : నగరి నియోజకవర్గానికి వెన్నెముక వంటి గాలేరు నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇటీవల పుత్తూరులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేణుగోపాలసాగర్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరిగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను నిలిపివేసింది. ఒక్క వేణుగోపాలసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం 2.6 టీఎంసీలు. దీంతో సుమారు 26 వేల ఎకరాలకు మూడు పంటలకు సాగునీరు, నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందించవచ్చు. గత ప్రభుత్వ హయాంలో గాలేరు నగరి ప్రాజెక్టు పనులు జరుగుతున్నా ప్రజలను మభ్యపెట్టడానికి ఎమ్మెల్యే రోజా నగరి నుంచి తిరుమలకు పాదయాత్ర చేశారు. మంత్రిగా ఉండికూడా ఆమె కనీసం ప్రాజెక్టు పరిస్థితిపై ఆరా తీసిన దాఖలాలు లేవు. టీడీపీ అధికారంలోకి వస్తే వేణుగోపాలసాగర్‌తో పాటు 0.5 టీఎంసీల సామర్థ్యంతో వేపగుంట రిజర్వాయర్, 0.88 టీఎంసీల సామర్థ్యం ఉన్న అడవికొత్తూరు రిజర్వాయర్లు కూడా పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మారుస్తాను.

"ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా, రాష్ట్ర మంత్రిగా రోజా ఒక్క పరిశ్రమైనా నియోజకవర్గానికి ఎందుకు తీసుకురాలేకపోయిందో సమాధానం చెప్పాలి. ఆమెకు అవినీతిపైన ఉండే శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపైన లేదు."

రైతులకు అండగా ఉంటా : గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీని తెరవాలని గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న రోజా ధర్నా చేశారు. మరి మంత్రిగా ఎందుకు తెరిపించలేకపోయారు? నిండ్ర షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు బిల్లులు ఎందుకు చెల్లించలేదు? ఏ అదృశ్యశక్తి అడ్డుపడుతోందో ఆమె రైతులకు చెప్పాలి. మామిడి రైతులు గిట్టుబాటు ధర లేకుండా విలవిల్లాడుతుంటే నోరు కూడా మెదపడంలేదు. మేము రైతులకు అండగా ఉంటాం. నిండ్ర షుగర్ ఫ్యాక్టరీ బకాయిలు చెల్లించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వపరంగా తీసుకుంటాము. మామిడికి గతంలో గిట్టుబాటు ధర రానప్పుడు చంద్రబాబు ప్రభుత్వం టన్నుకు రూ.5 వేలు మద్దతు ధర చెల్లించింది. గతంలో రైతులకు ఇస్తున్న అన్ని సబ్సిడీ పథకాలనూ పునరుద్ధరిసాం. సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఇవ్వడంతో పాటు ఎరువులు కూడా అందిస్తాం. రైతులకు అండగా నిలిచేది టీడీపీ ప్రభుత్వమే.

పరిశ్రమలను ఏర్పాటు చేస్తాము... : పరిశ్రమల ఏర్పాటుకు వడమాలపేట, విజయపురం మండలాలు అత్యంత అనుకూలం. వడమాలపేట మండలం తిరుపతికి ఆనుకుని ఉంటే, విజయపురం మండలం తమిళనాడు సరిహద్దు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు చేసిన భూసేకరణ ఈ ఎమ్మెల్యే కారణంగా ఎంత వివాదాస్పదమైంది అనేది అందరికీ తెలిసిందే. పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నప్పటికీ పొలిటికల్ కరప్షన్ కారణంగా పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు. ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా, రాష్ట్ర మంత్రిగా రోజా ఒక్క పరిశ్రమైనా నియోజకవర్గానికి ఎందుకు తీసుకురాలేకపోయిందో సమాధానం చెప్పాలి. ఆమెకు అవినీతిపైన ఉండే శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపైన లేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం, వడమాలపేట, విజయపురం మండలాల్లో పరిశ్రమల ఏర్పాటు కూడా తథ్యం. నియోజకవర్గ యువత ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉపాధి పొందే విధంగా కృషి చేస్తాను.

"ఈ ఐదేళ్ల పాలన చూసిన ప్రజలు విసిగిపోయారు. ఎన్నికల కోసం మాకన్నా ప్రజలే ఆతృతగా ఎదురుచూస్తున్నారు. వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపును ఆపలేరు."

నగరి గడ్డపై టీడీపీ జెండా : గత ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయాను. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన అబద్ధపు హామీలను ప్రజలు నమ్మారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక విధ్వంసపాలన సాగింది. అవినీతి, వనరుల దోపిడీ విచ్చలవిడిగా సాగింది.. విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచి పేద, మధ్య తరగతి వర్గాల నడ్డి విరిచారు. బియ్యం, నూనె, పప్పు, ఉప్పుతో సహా నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయి. ట్రాక్టర్ ఇసుక ధర రూ.5 వేలకు పెంచేశారు. ప్రతి పనికీ లంచం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల కోసం మాకన్నా ప్రజలే ఆతృతగా ఎదురుచూస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి రోజా నియోజకవర్గం కేంద్రంగా ఈ ఐదేళ్లలో చేసిన అవినీతి, నియోజకవర్గంపై ఆమె కుటుంబం పెత్తనం, ప్రశ్నించే వారిపై తారాస్థాయికి చేరిన కక్ష సాధింపులు ప్రజల గుండెల్లో బడబాగ్నిలా ఉన్నాయి. వారి ఆగ్రహ జ్వాలలకు రానున్న ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయం. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించేలా చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల కష్టంతో రానున్న ఎన్నికల్లో నగరి గడ్డపై టీడీపీ జెండా ఎగరడం ఖాయం.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చిన్నారిని ఆదుకుంటా: దగ్గుమళ్ల



చిన్నారికి ఆర్థికసాయం అందిస్తున్న ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 6: తండ్రి మరణం... ఆలనాపాలనా చూసే తల్లి కూడా దూరం కావడంతో ఓ చిన్నారిని నాయనమ్మ చూసుకుంటోంది. ఈ ఉదార ఘటన మండలంలోని టేకుమందలో చోటు చేసుకుంది. టేకుమంద గ్రామానికి చెందిన చంద్రమోహన్ గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో భార్య కూడా ఆ చిన్నారిని వదిలి వెళ్లిపోయింది. ఆ చిన్నారి తాత, అవ్వల వద్ద ఉండేది. ఏడాదిక్రితం తండ్రి మరణించడంతో అమ్మానాన్న లేని ఆ చిన్నారికి నాయనమ్మ, తాతలే దిక్కయ్యారు. దీంతో ఆ చిన్నారిని తీసుకొని చిత్తూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావుకు వివరించగా, స్పందించిన ఆయన ఆ చిన్నారికి రూ.20వేలు ఆర్థిక సాయంతో పాటు భవిష్యత్‌లో ఆ చిన్నారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పాలసముద్రం, ఏప్రిల్ 6: మండలంలో రాబోవు ఎన్నికలకు పోలింగ్ నిర్వహించే పాఠశాలలను ఎంపీడీవో రామనాథరెడ్డి శనివారం పరిశీలించారు. మండలంలోని ఎల్.ఎన్. పురం, రామలింగాపురం పాఠశాలలో మౌలిక వసతుల గురించి ఆయన తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, ఏప్రిల్ 6: మండలంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి టీడీపీ నేత ఊట్ల నాగరాజు నాయుడు కుటుంబ సభ్యులు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ నాయుడు, ఏకాంబరం, వీరభద్రయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ప్రదోషపూజలు



కులందేశ్వరాలయంలో నందీశ్వరుడికి ప్రదోష పూజలు చేసిన దృశ్యం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 6: నగరంలోని ఈశ్వరాలయాల్లో శని త్రయోదశి పూజలను భక్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో చేశారు. కట్టమంచి కులందేశ్వరాలయంలో అర్చకులు ఆదిశైవ సిద్ధ గురుకల్ బృందం శని ప్రదోషం సందర్భంగా రెండు బ్యాచ్‌లుగా స్వామివారికి తైలాభిషేకాలు, శని త్రయోదశి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి జల, క్షీర, పవిత్ర జల శంఖు తీర్థ అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో పురవీధుల్లో ఊరేగించారు. గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో, కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర, కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర ఆలయాల్లో ప్రదోష పూజలు జరిగాయి.

ఉపాధిహామీ పనుల తనిఖీ

తవణంపల్లె, ఏప్రిల్ 6: మండలంలోని టి.పుత్తూరు, తవణంపల్లె, దిగువతడకర పంచాయతీల పరిధిలో ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న పనులను పథకం సంచాలకులు రాజశేఖర్, క్వాలిటీ కంట్రోల్ టీమ్ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు.

అడవి కొత్తూరులో టీడీపీ ఇంటింటి ప్రచారం

నగరి, ఏప్రిల్ 6: నగరి మండల పరిధిలోని అడవికొత్తూరులో నగరి మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ కరపత్రాలను పంచుతూ సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించాలని, నగరి ఎమెల్యేగా భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు బాలాజీ, మీరా, దాము రెడ్డి, నారాయణస్వామి నాయుడు, బాలసురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి ఓటు రేపటి భవిష్యత్తు

చిత్తూరు, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ స్వీప్ నోడల్ బృందం శనివారం మహిళలకు సూచించారు. ఓటు హక్కు వినియోగంపై నగరంలోని 21వ డివిజన్‌లోని కుక్కలపల్లె, లక్ష్మయ్యవూరు ధర్మరాజులుగుడి వద్ద నోడల్ బృందం ఓటు హక్కు ప్రాధాన్యత, ఎథికల్ ఓటింగ్, ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. నగరంలో కళాజాతా బృందాలతో దొడ్డిపల్లె ఉన్నత పాఠశాల, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో ఓటర్ల చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

బెదిరింపులకు భయపడం: టీడీపీ నేతలు

- అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు: గురజాల జగన్మోహన్



మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్ నాయుడు

గుడిపాల, ఏప్రిల్ 6: బెదిరింపులకు భయపడే కార్యకర్తలు కాదని, భయం మా బయోడేటాలోనే లేదని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని కమ్మతిమ్మాపల్లి, కుప్పిగానిపల్లి, 13 గొల్లపల్లి, బసవాపల్లి గ్రామపంచాయతీల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరిట ప్రతి తల్లికి ఎంతమంది పిల్లలుంటే, ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున అందిస్తామన్నారు. 20 లక్షల మందికి ఉపాధి, యువగళం నిధి కింద నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. చిత్తూరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం సింగారపేటకు చెందిన మాజీ వీవో అగస్టీన్, సెల్వరాణి కుటుంబసభ్యులు, కుప్పిగానిపల్లి దళితవాడలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఆధ్వర్యంలో వెంకటేష్‌తో పాటు 20మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, ఎంపీటీసీ విజయలక్ష్మి, మహిళానేతలు సుమతి, దీపశ్రీ, ఉదయ, విక్టోరియా, శిల్ప, టీడీపీ నాయకులు చెన్నకేశవులు నాయుడు, మధుసూదన్ నాయుడు, బలరామ్, రెడ్డెప్ప, జయశీలన్, రఘునాథ నాయుడు, కిట్టు, కేపీ బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 6: టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి గురజాల ప్రతిమ అన్నారు. శనివారం నగరంలోని 8వ డివిజన్ వెంగళరావు కాలనీ, శివాజి నగర్ 9వ డివిజన్ భరత్ నగర్, గాంధీ నగర్, బీవీరెడ్డికాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, ఎల్ఎస్ కాలనీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. మహాశక్తి పథకాలను వివరించారు. ప్రతిమ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు మహిళలు ఆర్థికంగా ఎదగాలనే డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత, రాజశేఖర్, మధు, సతీష్, వరలక్ష్మి, రాణి, శ్రీదుర్గ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

ఆలయం వద్ద అన్నదానం

కార్వేటినగరం, ఏప్రిల్ 6: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఇక్కడ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ సూచించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన బాబురెడ్డి, అనుచరులు

నగరి, ఏప్రిల్ 6: నగరి పట్టణంలోని పలువురు శనివారం వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి నియోజకవర్గ అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నగరి పట్టణ టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్థానిక దేశమ్మగుడి మాజీ చైర్మన్, వైసీపీకి చెందిన బాబురెడ్డి, ఆయన అనుచరులు బాలాజీ, భాను, మోహన్, దేవా, తులసి, శేఖర్, విజ్జి, బాబుభాయ్, రామ్మూర్తి, చిరంజీవులు, సికిందర్‌భాయ్, రాజన్ తదితరులకు భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మున్సిపాలిటీలోని 141వ బూత్ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో 20 మంది మహిళలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వడివేలు, కౌన్సిలర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొత్తపేటకు చెందిన 40 మంది యువత టీడీపీలో చేరారు. భానుప్రకాష్ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారందరికీ న్యాయం చేస్తానని, ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో కష్టపడి టీడీపీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, వేలు, రమేష్‌రెడ్డి, రుక్కుం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల అభివృద్ధి: భాను

నగరి ఏప్రిల్ 6: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని నగరి నియోజకవర్గ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పంలో భానుప్రకాష్ శనివారం బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. నగరిలో గెలిచిన మంత్రి రోజా తన ఆస్తులను పెంచుకున్నారే గాని నగరి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించలేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, రజనీకుమార్, మాణిక్యవాసన్, గుణశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీచేసిన ఎన్‌క్యూఏఎస్ కమిటీ



మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 6: గంగాధరనెల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పీహెచ్‌సీ)ను నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ కమిటీ (ఎన్‌క్యూఏఎస్) డాక్టర్లు రాజ్‌కుమార్, భవానీకుమార్ రెండు రోజులపాటు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని డాక్టర్, ల్యాబ్, ఇంజక్షన్‌లు వేసేగది, ఫార్మసీ గది, డెలివరి గది, ఆస్పత్రి పరిసరాలను కేంద్ర కమిటీ డాక్టర్లు పరిశీలించి, అనంతరం పలురికార్డులను తనిఖీలు చేశారు. అనంతరం కేంద్ర కమిటీ డాక్టర్లను స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు శాలువలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ క్వాలిటీ మేనేజర్ దివ్యపండిట్, పీహెచ్‌సీ డాక్టర్లు దుర్గాదేవి, ప్రవీణ్, పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ధర్మరాజులస్వామికి పొంగళ్లు

గుడిపాల, ఏప్రిల్ 6: మండలంలోని చెరువు ముందరపూరు గ్రామంలోని ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద శనివారం కొత్తపల్లి కాలనీవాసులు పొంగళ్లు పెట్టారు. ప్రత్యేక అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించండి



కాంగ్రెస్ కరపత్రాలను చూపుతున్న ఇండియా కూటమి నాయకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 6: ఇండియా కూటమి చిత్తూరు అభ్యర్థి టిక్కి రాయల్‌ను గెలిపించాలని ఇండియా కూటమి పార్టీల నాయకులు చిత్తూరు ప్రజలను కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి టిక్కి రాయల్ మాట్లాడుతూ తాను పుట్టినప్పటి నుంచి చిత్తూరు ఎలా ఉందో అలానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా చిత్తూరు అభివృద్ధిని గాలికి వదిలేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే చిత్తూరును అభివృద్ధి చేస్తానని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ, వైసీపీలను గద్దె దింపాలన్నారు. చిత్తూరు అభివృద్ధికి మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలని ఆయన కోరారు. త్వరలో కూటమి తరపున ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంగరాజు, సురేంద్రకుమార్, కాంగ్రెస్ నేత రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 6: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దని, కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ సూచించారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీస్‌లో శనివారం ఎన్నికల సెక్టోరల్ అధికారులతో అర్జెంట్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ మండలంలోనైనా ఏ అధికారి అయినా సెక్టోరల్ అధికారులకు సహకరించకపోతే వెంటనే తనదృష్టికి తీసుకురావాలని చెప్పారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల తనిఖీకి జిల్లా ఎన్నికల పరిశీలకుల ప్రత్యేక అధికారి వస్తున్నట్లు సమాచారం అందిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతుల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, డిప్యూటీ తహసీల్దార్ తులసీరామ్, ఎన్నికల డీటీ విజయక్రిష్ణ, ఏఎస్‌వో ఆనందమోహన్ తదితరులు పాల్గొన్నారు.